క్లుప్తంగా

సాగునీరు విడుదల చేయాలి

రెంజల్(బోధన్): అలీసాగర్ ఎత్తిపోతల ద్వార ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ నెల 10న నీటిని విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ అధికారులు చెప్పినా, ఇప్పటివరకు విడుదల చేయడం లేదని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ డైరెక్టర్ మౌలానా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే నీటిని విడుదల చేస్తే పంటల సాగుకు అవకాశం లభిస్తుందన్నారు. అధికారులు త్వరగా ఎత్తిపోతల నీటిని విడుదల చేయాలని కోరారు.

రేపటి నుంచి శ్రీరామ స్వర్ణ పాదుకలతో శోభాయాత్ర



ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్ నుంచి అయోధ్య వరకు ఈనెల 17నుంచి 14రోజుల పాటు రామరాజ్యం ఫౌండేషన్, రామరాజ్యం సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ రామ స్వర్ణ పాదుకలతో శోభాయాత్ర కొనసాగుతుందని రామరాజ్యం ఫౌండేషన్ వ్యవస్థాపకులు నంగి దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లో ఆదివారం కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈనెల 19న సాయంత్రం ఆర్మూర్ మీదుగా శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. సురేష్ ఆత్మారాం మహారాజ్, అ య్యప్పసేవా సమితి అధ్యక్షుడు పెంట జలంధర్, గురు స్వామి నగేష్‌శర్మ, అయ్యప్ప స్వా ములు మాసలా సత్యనారాయణ, సురేష్, మీసాల రాజేశ్వర్, శ్రావణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్: మండలంలోని ఆదర్శ(మోడల్) పాఠశాలలో ఫిజిక్స్ టీచర్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్ సబ్జెక్టులో పీజీ చదివి బీఈడీ శిక్షణ పొందిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్‌లో బోధించిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు దరఖాస్తులను ఈ నెల 17లోపు పాఠశాలలో అందజేయాలని ఆయన తెలిపారు.

నియామకం



ఆర్మూర్‌టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ డిస్ట్రిక్ గవర్నర్‌గా నియమితులయ్యారు. లయన్స్ డీజీ పంపాటి, డీసీపీ మధుకర్ స్వామి హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో పృథ్వీరాజ్‌కు నియామకపత్రం అందజేశారు. లయన్స్ సభ్యులు రాజేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ సిటీ: నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 'ఆశా వర్కర్ల బస్సు జాతా' కార్యక్రమ వాల్‌పోస్టర్లను సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘ ప్రతినిధి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 31 వరకు బస్సు జాతా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనం ప్రకటించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈనెల 19న జిల్లాకేంద్రానికి బస్సు జాత రానుందన్నారు. ఆవా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రేణుక, రాధా, సరిత, లక్ష్మి, విజయలు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఖండిద్దాం

నిజామాబాద్ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఖండిద్దామని ఏఐపీకేఎస్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో ఆదివారం ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. రైతుల శాంతియుత పాదయాత్రను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. రైతులను చూసి మోదీ సర్కార్ భయపడుతుందన్నారు. రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రైతులపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి మద్దతుగా అన్ని పక్షాలు, రైతులు, కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. నాయకులు రామకృష్ణ, పెద్ది వెంకట్రాములు, గంగారాం, వేల్పూర్ భూమయ్య, దేవరాం, గంగాధర్, కిషన్, పల్లపు వెంకటేష్, సాయరెడ్డి, పుట్టి నడ్పి నాగన్న, రాజన్న, బాబన్న, దామోదర్, రమేష్, గంగాధర్, అనిస్ పాల్గొన్నారు.

కంకర తేలిన రహదారి

- పోచంపాడ్‌లో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పోచంపాడ్‌లో కంకర తేలిన సిమెంట్ రోడ్డు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ (శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్) వద్ద గల శివాలయం, రామాలయంనకు వెళ్లే రోడ్డు పూర్తిగా కంకర తేలింది. దీంతో భక్తులు శివ శివ ఇదేం రోడ్డు అంటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రధాన రోడ్డు నుంచి ఆలయాలకు వెళ్లే మరో ప్రధాన దారిని కలుపుతూ సిమెంట్ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు గుండానే పవిత్ర గోదావరికి భక్తులు వెళ్తారు. దీంతో ప్రతి సోమ, శుక్రవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కానీ నాసిరకంగా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో రోడ్డుపై సిమెంట్ పోయి, కంకర తేలింది. అయినా రోడ్డు గురించి సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కంకర ఎక్కువ తేలడంతో అడుగు తీసి అడుగు వేయాలేకపోతున్నారు. బైక్‌లపై వెళ్తే టైర్లు పంక్చర్లు అవుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. అధ్వాన రహదారిలో భక్తులు నిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఉమ్మడి మండలంలో..

ఉమ్మడి బాల్కొండ మండలం(బాల్కొండ, ముప్కాల్, మెండోరా)లోని పలు గ్రామాల్లో కొన్ని రోడ్ల పరిస్థితి ఇలానే ఉంది. ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో రోడ్డు పరిస్థితి ఇలానే ఉంటే విజిలెన్స్ తనిఖీలు నిర్వహించి, నాణ్యత ప్రమాణాలు పాటించలేదని తేల్చింది. అంతేకాకుండ నూతనంగా రోడ్డు వేసేలా చర్యలు తీసుకుంది. బాల్కొండ మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కూడ సిమెంట్ రోడ్లు మొత్తం కంకర తేలాయి. ప్రధాన కాలనీలకు వెళ్లుటకు తిప్పలు తప్పడం లేదు. రోడ్డు నిర్మాణాలపై నాణ్యత ప్రమాణాలపై సంబంధిత అధికారులకు పలుమార్లు సాక్షి ఫోన్‌లో సంప్రదించిన ఎలాంటి స్పందన ఇవ్వలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సొంతంగా తూముకు మరమ్మతులు

- ముసలమ్మ చెరువులో పనులు చేయిస్తున్న మోర్తాడ్ వీడీసీ
- ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతోనే..



ముసలమ్మ చెరువు తూంగేట్ వద్ద మరమ్మతులు చేస్తున్న కార్మికులు

మోర్తాడ్: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు తయారైంది మోర్తాడ్‌లోని ముసలమ్మ చెరువు పరిస్థితి. చెరువులో నీరు సమృద్ధిగా ఉన్నా నీటిని పంట పొలాలకు అందించడానికి తూంగేట్ తెరిచే పరిస్థితి లేకపోయింది. తూంగేట్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. ఈక్రమంలో మోర్తాడ్ వీడీసీ ఆధ్వర్యంలో సొంత నిధులతో మరమ్మతులను చేపట్టారు. ఇందుకోసం ఆదివారం విశాఖపట్నం నుంచి కార్మికులను సైతం రప్పించారు.

ఇదీ పరిస్థితి..

ముసలమ్మ చెరువులో వర్షం వల్ల వచ్చే నీటితోపాటు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు వచ్చి చేరుతుంది. ఈ చెరువు కింద దాదాపు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది.

కానీ చెరువు తూంగేట్ గత కొన్ని నెలలుగా తెరుచుకోకపోవడంతో సాగునీటిని అందించే పరిస్థితి లేకపోయింది. ఈక్రమంలో రైతులు బోరుబావుల ద్వారానే సాగునీటిని అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పైప్‌లైన్ వేసుకోవాల్సి వచ్చింది. గతంలో రూ.3కోట్ల నిధులతో చెరువు మరమ్మతులు చేసినా తూంగేట్ విషయంలో నిర్లక్ష్యం వహించడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. తూంకు గతంలోనూ ఆయకట్టు రైతులు సొంతంగా నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వీడీసీ ఆధ్వర్యంలో తూంకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఇందుకోసం విశాఖపట్నం నుంచి ప్రత్యేకంగా కార్మికులను రప్పించారు. వారు చెరువులో దిగి గంటల తరబడి మరమ్మతులు చేస్తేనే గేట్ తెరుచుకునే పరిస్థితి ఉంది. కార్మికులు ఎక్కువ సమయం నీటిలో ఉండటానికి ఆక్సిజన్‌తోపాటు, ప్రత్యేక టార్చిలైట్లు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సమకూర్చారు. మరమ్మతులకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు కావచ్చని అంచనా వేస్తున్నారు. యాసంగి వరి సాగుకు రైతులు సన్నద్ధం కావడంతో చెరువు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఇందుకోసం వీడీసీ సొంతంగా మరమ్మతులు చేయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రైతుల ప్రయోజనం కోసమే..



రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ముసలమ్మ చెరువుకు సొంతంగా మరమ్మతులు చేయిస్తున్నాం. స్థానికంగా ఉన్న కార్మికులతో మరమ్మతులు చేయించాలని ప్రయత్నించాం. వారితో సాధ్యం కాకపోవడంతో విశాఖపట్నం నుంచి ప్రత్యేకంగా కార్మికులను రప్పించాం. త్వరలోనే పనులు పూర్తవుతాయి.

– జక్కం అశోక్, వీడీసీ అధ్యక్షుడు, మోర్తాడ్

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి వేడుకలు





దత్తాపూర్‌లోని శివదత్త ఆలయంలో మూలవిరాట్.. నందిపేటలో పూజలు నిర్వహిస్తున్న స్వాములు



బస్వాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాలరాజు

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం దత్తాత్రేయ జయంతిని భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని మండలాలు, గ్రామాల్లోని దత్తాత్రేయ ఆలయాలు, ఆశ్రమాల్లో వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం భజనలు, డోలారోహణం, పల్లకీసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీలు, వీడీసీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే సాయిబాబా ఆలయాల్లోనూ దత్త పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామంలోని దత్తాత్రేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు.



గైనిగుట్టలో..



నవీపేటలో..



చిట్టాపూర్‌లో..



దత్తాపూర్‌లో అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు..



కొల్‌పూర్‌లోని భూమయోగేశ్వర ఆశ్రమంలో..



దత్తాపూర్‌లో డోలారోహణం నిర్వహిస్తున్న భక్తులు



మెండోరాలో పల్లకీసేవ..

■ ఘనంగా కండె రాయుడు మల్లన్న జాతర



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్‌లో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కండె రాయుడు మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన రథోత్సవం కనులపండువగా సాగింది. ఈనెల 22న రెండవ రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు.

■ వైభవంగా అయ్యప్ప పడిపూజ



నందిపేట్(ఆర్మూర్): మండలకేంద్రంలో ఆదివారం అయ్యప్ప రుషితుల్య మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..



రుద్రూర్: మండల కేంద్రంలోని శిరేఖ గార్డెన్‌లో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హారతి కార్యకమాలు నిర్వహించారు. అనంతరం భజనలు నిర్వహించారు.

■ ముగిసిన గీతా పారాయణం, యజ్ఞం



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠానాకలాన్ గ్రామంలో గత ఐదు రోజుల నుంచి కొనసాగుతున్న గీతా పారాయణం ఆదివారం ముగిసింది. భగవద్గీతలోని 18 అధ్యాయాలలో ప్రతిరోజు నాలుగు అధ్యాయాలు, ముగింపు రోజు రెండు అధ్యాయాలతో పూర్ణాహుతి నిర్వహించారు.

■ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



బాల్కొండ: మండల కేంద్రంలో ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామీ–గోవిందాంబ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

■ నేడు శివాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ..

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో శివాలయం పునర్నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్షలు



ఆర్మూర్‌లోని నారాయణ పాఠశాల పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మున్సిపల్ పరిధిలో మొత్తం 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. క్షత్రీయ కళాశాల, నారాయణ, కృష్ణవేణి, సుభాషిత పాఠశాల, ప్రభుత్వ బాలికల కళాశాల, ప్రభుత్వ డిగ్రీ, విజేత, నరేంద్ర, నరేంద్ర ఉమేన్స్, నరేంద్ర పీజీ కళాశాలలోని పరీక్ష కేంద్రాల్లో మొత్తం 3988 అభ్యర్థులకు గాను 1375మంది అభ్యర్థులు హాజరైయ్యారు.

పదవుల్లో మాలలకు న్యాయం చేయాలి

నిజామాబాద్‌నాగారం: కాంగ్రెస్ పార్టీకి మాలలు అండగా ఉన్నారని, నామినేట్ పదవులతోపాటు, యూనివర్సిటీ వైస్ చైర్మన్ పదవుల్లో తమకు న్యాయం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాలలకు మరో మంత్రి పదవి ఇవ్వాలన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ నుంచి మాలలకు ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ కమిషన్ చైర్మన్ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 40 కార్పొరేషన్‌లకు చైర్మన్లను ఇచ్చారని, వాటిలో ఒక్కటి కూడా మాలలకు ఇవ్వలేదన్నారు. టీజీపీఎస్సీలో సభ్యులుగా, యూనివర్సిటీల వైస్ చైర్మన్‌ల పదవులు ఇవ్వాలన్నారు. కుల గణన జరిగిన తర్వాత జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ, ఉద్యోగ పరంగా అవకాశాలు కల్పించాలన్నారు. అప్పటి వరకు వర్గీకరణ అంశాన్ని నిలిపివేయాలన్నారు. నాయకులు చొక్కం దేవిదాస్, వినయ్, గైని సాగర్, పోశెట్టి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	మిస్‌యూ (తెలుగు) - 10.45 పని (తెలుగు) -1.35 మిస్‌యూ - 4.40 7.30 10.20
స్క్రీన్-2 –	పుష్ప-2 (తెలుగు) - 10.15 2.20 6.25 10.30
స్క్రీన్-3 –	పుష్ప-2 (తెలుగు) -12.20 4.25 8.30
స్క్రీన్-4 –	పుష్ప-2 (తెలుగు) -1.20 5.25 9.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప - 2 (తెలుగు) - 1.30,7.00
స్క్రీన్-2	మిస్‌యూ (తెలుగు) - 10.40 , 1.20,7.50,10.30
స్క్రీన్-3	పుష్ప -2(తెలుగు)-11.0,4.30,10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10,10.15
స్క్రీన్-2	ఫియర్(తెలుగు)-11.45 మిస్‌యూ(తెలుగు)-2.20 పుష్ప-2 (తెలుగు)-5.10 9.15
స్క్రీన్-3	ప్రణయ గోదారి(తెలుగు)-11.10 పుష్ప-2(హిందీ)- 2.20 6.25 10.30
స్క్రీన్ -4	పుష్ప-2(హిందీ)-10.00 పని(తెలుగు) -2.05 మిస్‌యూ-5.10 10.35 ఫియర్(తెలుగు)- 10.35
లలితామహల్	మిస్‌యూ (తెలుగు)
దేవి	పని(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,000	వెండి(కిలో)	96,500
22 క్యారెట్స్	72,890		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

చెత్తాచెదారం తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ, సమైఖ్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు కాలనీ పరిసరాల్లో చెత్తాచెదారం తొలగించారు. డ్రెయినేజీల్లో వ్యర్థాలను తొలగించారు.

హంగర్గాలో వైద్య శిబిరం



రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గాఫారంలో ఆదివారం కోటగిరి మండల కేంద్రానికి చెందిన బర్ల మధు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సంజీవని ఆస్పత్రి వైద్యురాలు ఇంతియాజ్ బేగం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఎజాజ్‌ఖాన్, సాయిలు, ప్రభాకర్, సజ్జత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ హైస్కూలు విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి లగోరి ఆటల పోటీల్లో ప్రతిభ చూపి ద్వితీయస్థానం సాధించినట్లు హెచ్ఎం మల్లీశ్వరి ఆదివారం తెలిపారు. బాలికలలో రుచిత, షైని, శృతి, బాలుర విభాగంలో శ్రీకాంత్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

అనాథ ఆశ్రమానికి చేయూత



వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ తరపున ఆర్మూర్‌లోని తపస్వి తేజో నిలయం అనాథాశ్రమానికి రూ. 16వేల విలువైన నిత్యావసర వస్తువులు వితరణ చేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. సంస్థ సభ్యులు జేమ్స్ గంగారెడ్డి, గంగారెడ్డి, జ్యోతికుమార్, దాస్, స్టివెన్, కిరణ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.